RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 200 | జులై 05, 2025 | వెల : రూ.3-00



సబ్బాన్‌కు హాస్టల్‌లో సీటు..!

4లో..



# కార్యకర్తలే బలం

- జై బాపు, జై భీం, జై సంవిధాన్ పేరుతో ప్రజల వద్దకు వెళ్లాలని పిలుపు
- రైతు రాజ్యం ఎవరు తెచ్చారో చర్చకు రెడీ
- మోడీ, కిషన్‌రెడ్డి, కేసీఆర్ డిస్కషన్‌కు ఎవరొచ్చినా ఓకే
- కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యత నాది: సీఎం రేవంత్‌రెడ్డి

## - వారి వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పవర్‌లోకి..
## - ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

జై బాపు, జై భీం, జై సంవిధాన్ పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణం పార్టీ కార్యకర్తలేనని ప్రశంసించారు. కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీ బలమని పేర్కొన్నారు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం..చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోడీ, కిషన్‌రెడ్డి ఎవరొచ్చినా సరే అని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.ఎల్బీ స్టేడియంలో జరిగిన పార్టీ సామాజిక న్యాయ విజయభేరీ సభలో సీఎం ప్రసంగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో దూసుకుపోతున్న కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ప్రభుత్వం తరపున ప్రచారకర్తలుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, ఎంపీ సీట్లు పెరగనున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే వచ్చే ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలవబోతున్నాయని వివరించారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని, అందులో ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యత అని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 15 లోక్సభ సీట్లు తప్పకుండా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

తమకు ఎదురులేదని భావించిన కల్వకుంట్ల గడీని బద్దలు కొట్టామని ఆనందించారు. ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన సాగిస్తున్నామని, ఇదే తరహా పాలన రాబోయే రోజుల్లోనూ సాగుతుందని వివరించారు. కాంగ్రెస్ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని, తామంతా కొట్టుకుంటామని కలసి ఉండలేమని విపక్షాలు చేసిన ఆరోపణలను తప్పని నిరూపించామన్నారు. కాంగ్రెస్ నేతలు ఐకమత్యంతో పని చేస్తూ అపోహాలను పటాపంచలు చేశారని నేతలకు దిశానిర్దేశం చేశారు. జనగణనతో పాటు కులగణన చేస్తామని, ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాట ఇచ్చారని, హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించామని సీఎం గుర్తు చేశారు. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించామన్నారు. ఈ సమయంలోనే కష్టాలు వచ్చాయని, ఒడిదొడుకులు వచ్చాయని, అయినా అన్నింటిని అధిగమించి ముందుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు.

**- బీసీల కోసం కాంగ్రెస్ పని చేస్తోంది: ఖర్గే**

రేవంత్‌రెడ్డి, భట్టి అందరూ కలిసికట్టుగా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, కేసీఆర్‌ను ఓడించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని కితాబిచ్చారు. గతంలో రైతులు,

మిగతా 3వ పేజీలో..

# నీళ్లు దోచుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**




నాడైనా నేడైనా తెలంగాణ ప్రయోజనాల ముందు పదవులు బీఆర్ఎస్‌కు తృణప్రాయం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బనకచర్లతో ఏపీ అప్పనంగా నీళ్ళు దోచుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం అని ఆయన హెచ్చరించారు. పోలవరం, పోతిరెడ్డిపాడు, పులిచింతల వంటి ఏపీ అక్రమ ప్రాజెక్టులను నిరసిస్తూ 20 ఏళ్ల క్రితం ఇదే రోజున (04.07.2005) మంత్రి పదవులకు రాజీనామాలు చేశాం. కేసీఆర్ ఆదేశానుసారం.. ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ నీటి హక్కుల కోసం పదవులను గడ్డి పోచలుగా భావించి వదులుకున్నం. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో.. ఆంధ్రప్రదేశ్ బనకచర్ల పేరిట గోదావరి నీళ్ల దోపిడి చేస్తానంటే చూస్తూ ఊరుకుంటామా? అని హరీశ్‌రావు నిలదీశారు. నాడైనా, నేడైనా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీసే ఏ కుట్రలనైనా బీఆర్ఎస్ పార్టీ సహించదు. పదవులకు రాజీనామాలు చేయడం మాత్రమే కాదు, పేగులు తెగేదాకా కొట్లాడుతం. తెలంగాణకు అన్యాయం జరగకుండా కాపలా ఉంటం.

# ‘బంధన్’కు డీఎంహెచ్‌వో షోకాజ్ నోటీసు

**- ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదు? - మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశాలు**

**వేద న్యూస్, హనుమకొండ :**




బంధన్ ఆస్పత్రికి హనుమకొండ డీఎంహెచ్‌వో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సదరు ప్రైవేటు ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో మూడు రోజులలో వివరణ ఇవ్వాలని హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌ను కోరారు. షోకాజ్ నోటీసు వివరాల ప్రకారం.. వరంగల్‌వాసి ఎల్.కృష్ణకు బంధన్ ఆస్పత్రిలో వైద్యులు డాక్టర్ నలిన్ కృష్ణ గతేడాది ఫిబ్రవరి 12న అపెండిక్స్ ఆపరేషన్ చేశారు. దీనిపై బాధితుడు, పేషెంట్ ఎల్.కృష్ణ వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. సదరు ప్రైవేటు ఆస్పత్రిలో తనకు సర్జరీ చేయడంలో వైద్యుడు విఫలమయ్యారని, ఆస్పత్రిలో తనకు ట్రీట్‌మెంట్ సరిగా జరగలేదని, పోస్ట్ ఆఫ్ కేర్‌లో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని పేర్కొన్నాడు. ఈ క్రమంలో తాను ప్రాణాపాయ స్థితికి వెళ్లే పరిస్థితి రాగా, వెంటనే సదరు ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ మెడికవర్ ఆస్పత్రికి వెళ్లినట్టు చెప్పారు. అక్కడ తనకు మరో సర్జరీ జరిగిందని, సుమారు 20 రోజుల పాటు వైద్యులు ట్రీట్‌మెంట్ చేశారని, రూ.14 లక్షలు అక్కడ తనకు ఖర్చయ్యాయని వెల్లడించారు.

ఈ నేపథ్యంలో సదరు బాధితుడి ఫిర్యాదు ఆధారంగా డీఎంహెచ్‌వో ఆఫీసు..‘బంధన్’తో పాటు ‘మెడికవర్’ ఆస్పత్రుల నుంచి కేస్‌షీట్లను సేకరించింది. ఇరు ఆస్పత్రులకు సంబంధించిన కేస్ షీట్లను ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఎక్స్‌పర్ట్స్ పంపించింది. ‘ఎంజీఎం’ నిపుణులు వాటి ఆధారంగా నివేదికను సమర్పించారు. దాని ప్రకారం..సదరు బంధన్ ఆస్పత్రిలో మెడికల్ పద్ధతిలో కాకుండా పేషెంట్‌కు ఓపెన్ సర్జరీ నిర్వహించినట్టు వెల్లడించారు. నిపుణుల కమిటీ ఆ ప్రైవేటు ఆస్పత్రిలో నిర్లక్ష్యం జరిగినట్టు పేర్కొంది. డాక్టర్ ఎన్.నలిన్ కృష్ణ, డాక్టర్ ప్రణీత్ రాజ్‌లు సదరు ఆస్పత్రికి కన్సల్టెంట్ డాక్టర్లు కానప్పటికీ వారి చేత శస్త్రచికిత్స చేయించడం ఆస్పత్రి అసమర్థతతను స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. వైద్యుల అసమర్థత, నిర్లక్ష్యం వల్ల పేషెంట్ పరిస్థితి ‘బంధన్’ ఆస్పత్రిలో తీవ్ర విషమంగా మారిందని నిర్ధారించారు. ఈ సందర్భంలో సదరు ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్(రిజిస్ట్రేషన్, రెగ్యులేషన్) చట్టం 2010, నియమనిబంధనలు 2011 ప్రకారం ఎందుకు సస్పెండ్ లేదా క్యాన్సిల్ చేయకూడదో.. మూడు రోజులలో వివరణ ఇవ్వాలని ఆస్పత్రి యాజమన్యానికి డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు.

# నగరాన్ని ముంపు నుంచి కాపాడండి

**- జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు గంట రవికుమార్ వినతి**

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



వరంగల్ మహానగరంలో ముంపు ప్రాంతాలు ఏటేటా పెరుగుతున్నాయని, నాలాల కబ్జా, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో చినుకుపడితే నగరవాసులు జంకుతున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం డబ్ల్యూజీఎంసీ కమిషనర్‌కు భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో చిన్నపాటి వర్షానికే జనావాసాలు, కాలనీలు నీట మునుగుతున్నాయని పేర్కొన్నారు. ఖిలా వరంగల్‌లోని అగర్తల చెరువు కాలువ ద్వారా శివనగర్‌పై

మిగతా 3వ పేజీలో..

# ప్రజలను మోసం చేసిన ముఠా అరెస్టు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




మిర్యాలగూడ పట్టణం లోని హౌసింగ్ బోర్డు కాలనీ లో ఆర్కే ఎంటర్ప్రైజెస్ అనే పేరుతో ఒక మల్టీ లెవల్ సంస్థను స్థాపించి, మిర్యాలగూడ పరిసర ప్రాంతాలలో అమాయక ప్రజలను లక్కీ డ్రా పేరుతో మోసం చేసిన ముగ్గురు ఘరానా మోసగాళ్ళను మిర్యాలగూడ- టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.70,00,000 విలువ గల మోసగించిన సొత్తు ను స్వాధీనము చేసుకోని న్యాయ స్థానానికి సమర్పించారు.నగదు రూ.6,55,500లతో కొనుగోలు చేసిన రెండు ఓపెన్ ఫ్లాట్ల మరియు ఒక ఇంటి దస్తావేజు లు లీజుకు తీసుకుని నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ దస్తావేజు లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు ఆధ్వర్యంలో చేధించిన సీఐ మోతీరామ్, 1 టౌన్ ఎస్.ఐ. సైదిరెడ్డి,కానిస్టేబుల్ లు.శ్రీను, నర్సింహా, సైదులు, వీరబాబు, తమీజుద్దీన్, సైదులు, ప్రసాద్ లను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

# ఇసుక అక్రమరవాణాపై కొరడా

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**






**-13 ట్రాక్టర్లు పట్టివేత..పరారీలో 20 ట్రాక్టర్లు**

ఎల్లారెడ్డిపేట మండలంలో ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులు విరుచుకుపడ్డారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మాత్రమే అనుమతి ఉండగా, పర్మిషన్ ఉల్లంఘిస్తూ ఉదయమే 7 గంటల సమయంలోనే ట్రాక్టర్లు వెంకటాపూర్ వాగులోకి దిగి ఇసుకను సరదాపూర్‌కి తరలించేందుకు ప్రయత్నించారు.సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి ట్రాక్టర్లను వెంబడించారు. ఈ దాడిలో 33 ట్రాక్టర్లు సమయానికి ముందే దిగాయి. వాటిని తరలించే సమయంలో 20 ట్రాక్టర్లు తప్పించుకుని పోయినట్లు 13 ట్రాక్టర్లను పట్టుకుని ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మిగతా 20 ట్రాక్టర్లను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారనీ ట్రాక్టర్ల పూర్తి వివరాలు రెవిన్యూ అధికారుల వద్ద ఉన్నాయని తెలిపారు. మొత్తం 33 ట్రాక్టర్లలో సమయానికి ముందు దిగిన వాటిలో మొదటిసారి అయితే ఫైన్ వేయబడుతుందని, రెండోసారి మూడోసారి, అయితే కేసులు నమోదు చేయబడుతుందని తాసిల్దార్ సుజాత హెచ్చరించారు.




# ఖర్గే సభకు కాంగ్రెస్ నేతలు

**వేద న్యూస్, జమ్మికుంట:**

ఎల్బీ స్టేడియంలో నిర్వహించే రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనానికి జమ్మికుంట కాంగ్రెస్ నేతలు శుక్రవారం తరలివెళ్లారు. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదేశానుసారం జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు హైదరాబాద్‌కు వెళ్లారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వీరమనేని పరశురాం, ఇల్లందకుంట దేవస్థాన చైర్మన్ రామారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఐనవోలులో కేటీఆర్ సేన ప్రత్యేక పూజలు



**వేద న్యూస్, వరంగల్:**

కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగాని మనోహర్, ఆ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు మైనాల నరేష్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేటీఆర్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి మింటిరెడ్డి అశోక్, సోషల్ మీడియా ఇన్ చార్జి బాబుమియా, ఐనవోలు బీఆర్ఎస్ నాయకులు వంశీ, స్టేట్ జనరల్ సెక్రటరీ శీలం స్వామి, పరకాల ఇంచార్జ్ అభిషేక్, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు చిర్ర సుమన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పనిచేయని లిఫ్ట్..వృద్ధులు పాట్లు..!


**- హన్మకొండ కలెక్టరేట్‌లో అర్జీదారులు, ఉద్యోగుల అవస్థలు - సత్వరమే బాగు చేయించాలని వినతి**

**వేద న్యూస్, హన్మకొండ:**

అది జిల్లా పాలనాధికారి (ఐఏఎస్) ఉండే ఆఫీసు. నిత్యం జిల్లా బాస్ సదరు డిస్ట్రిక్ట్‌కు సంబంధించిన పనులకు సంబంధించిన ఆదేశాలు వెలువరిస్తుంటారు. జిల్లా ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఆ ఆఫీసుకు వచ్చి.. కంప్లయింట్స్‌తో పాటు వినతపత్రాలు సమర్పిస్తుంటారు. అలాంటి పాలనా కార్యాలయంలో లిఫ్ట్ సేవలు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌కు సంబంధించిన ముచ్చట అండోయ్ ఇది..

**- సుమారు నెల రోజులైనా పట్టింపులేదా?**

సుమారు నెల రోజుల నుంచి హనుమకొండ డిస్ట్రిక్ట్ కలెక్టరేట్‌లో లిఫ్ట్ పనిచేయడం లేదు. అయినా ఇంతవరకు వాటిని బాగు చేయలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే వృద్ధులు, దివ్యాంగులతో పాటు ఉద్యోగులు సైతం మెట్లు ఎక్కలేక ఇబ్బంది పడుతున్నారు. మూడు ఫ్లోర్లు (జీ ప్లస్2) ఉన్న హన్మకొండ కలెక్టరేట్ భవనంలో రెండో అంతస్తులో హన్మకొండ జిల్లా వైద్యశాఖ అధికారి ఆఫీసు ఉంది. రెండో అంతస్తు కావడంతో వృద్ధులు, దివ్యాంగులు, మెట్లు ఎక్కలేక లిఫ్ట్‌ను ఆశ్రయిస్తుంటారు. సుమారు నెల రోజుల క్రితం లిఫ్ట్ పాడైపోయినట్టు సమాచారం. దీంతో శుక్రవారం పలు పనుల మీద వచ్చిన పలువురు ఆపసోపాలు పడుతూ, మెట్ల మీదుగా వెళ్లాల్సి వచ్చింది. జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



# ప్రభుత్వ నిషేధిత గుట్కా పట్టివేత

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్వర్ తన సిబ్బందితో శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహించారు. నేరేడుపల్లి గ్రామస్తుడు అయిన ముక్క సుదర్శన్ కిరణం షాపులో ప్రభుత్వ నిషేధిత టోబాకో పాకెట్లు అమ్ముతున్నారనే సమాచారం రాగ వెంటనే నేరేడుపల్లి గ్రామంలోని సుదర్శన్ కిరాణం షాపులో తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వ నిషేధిత టోబాకో ప్యాకెట్లు లభించాయి. వాటి విలువ రూ.282 ఉంటుందని తెలిపి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.ఎవరైనా ప్రభుత్వ%శీ% నిషేదించిన గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్సై జక్కుల పరమేశ్వర్ తెలిపారు.

# సమాజ సేవే లక్ష్యం

**వేద న్యూస్, బోయినిపల్లి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు మొదటి ద్వితీయ తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఆతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా నిరంతరం సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తున్నామని , మహనీయుల యొక్క చరిత్రను విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడం కోసం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తూ బహుమతులు ప్రధానం చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థినీ విద్యార్థులు మహనీయులైన స్వామి వివేకానంద ,నేతాజీ సుభాష్ చంద్రబోస్, డా, బి ఆర్ అంబేత్కర్,గాంధీజీ స్ఫూర్తితో ఎంచుకున్న లక్ష్యాల దిశగా ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించి ,సామాజిక సేవలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలిపారు. యువజన సంఘాల అధ్యక్షులు అమిరి శెట్టి భూమ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాల దిశగా ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ విద్యానికేతన్ పాఠశాల చైర్మన్ బిల్ల ఆనందం ,ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి బోయిని వేణు , సభ్యులు తాళ్ళ పల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో శుక్రవారం చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కు లబ్ధిదారులైన కళ్యాణం భారతమ్మ, కుటుంబ సభ్యులకు నలభై ఐదు వేల రూపాయల (45000) చెక్కును స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఒంటెల గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి, ఏమిరెడ్డి సురేందర్ రెడ్డి, సంధి శ్రీనివాస్ రెడ్డి, కొంకటి మధుకర్, ఒంటెల లక్ష్మరెడ్డి,గోపు బాపు రెడ్డి, లక్ష్మన్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్ అప్పగింత




**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండల పరిధిలోని మాచినపల్లికి చెందిన పర్లపల్లి కవిత నెల రోజుల క్రితం ఫోన్ పోగొట్టుకున్నారు. ఈ విషయమై జమ్మికుంట పోలీసు వారిని సంప్రదించగా, ఆమెకు సంబంధించిన సామ్‌సంగ్ మొబైల్ ఫోన్‌ను ఐఎంఈఏ నంబర్ ద్వారా సీఈఐఆర్ పోర్ట్ ఆధారంగా పట్టుకున్నారు. సదరు ఫోన్‌ను శుక్రవారం జమ్మికుంట పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామకృష్ణ కవితకు అందజేశారు. ఎవరైనా తమ మొబైల్ ఫోన్ ను పోగొట్టుకున్నప్పుడు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించుకోవాలని సీఐ సూచించారు.

# 'పీర్ల' మొక్కులు చెల్లింపు



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండల పరిధిలోని మడిపల్లి గ్రామంలో పీర్ల పండుగ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందూ, ముస్లిం అనే మత భావం లేకుండా అందరూ కలిసి సంబురాలు జరుపుకున్నారు. పీర్లకు మొక్కుబడులు చెల్లించుకుంటే తమ కష్టాలు తొలగిపోతాయనే భావంతో ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. లక్ష్మి శ్రీరామ్ దంపతులు పీర్లకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పీరీల నిర్వాహకులు జలీల్ షేక్, అంకుస్ చాంద్ పాషా, బిస్తే రాజయ్య, అప్పాల శ్రీధర్ అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రేపు 'అమ్మ' ఆస్పత్రితో మెగా గుండె క్యాంపు

**వేద న్యూస్, జమ్మికుంట:**

ఈ నెల 6న(ఆదివారం) జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ వద్ద ఉన్న అమ్మ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మెగా గుండె క్యాంపు నిర్వహించనున్నట్టు ఆ ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ భగీరత్ అత్తె ఎండీ, డీఎం.. ఈ క్యాంప్‌నకు హాజరుకానున్నారు. ప్రతి ఆదివారం సదరు వైద్యులు అందుబాటులో ఉంటారని, పిల్లలు, పెద్దలకు తగు వైద్యం అందించనున్నారని వెల్లడించారు.

## కార్యకర్తలే 'చేతి' బలం



మహిళలు, నిరుద్యోగులను బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు సన్నబియ్యం, రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పార్టీ నెరవేరుస్తోందని తెలిపారు. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమేనని, బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని గుర్తుచేశారు.

# సంపాదకీయం

## కార్మికులకు మరణశాసనం లేబర్‌కోడ్స్

1991లో వచ్చిన సరళీకృత ఆర్థిక విధానాలు, కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక వైఖరి, ప్రయివేటీకరణ పోకడల్ని నిరసిస్తూ, కార్మిక హక్కుల్ని కాపాడటం కోసం పది కేంద్ర కార్మిక సంఘాలు నాటి నుండి నేటి వరకు దేశవ్యాప్తంగా 21 సమ్మెలు నిర్వహించాయి. ప్రధాన రంగాల ప్రయివేటీకరణ, విదేశీ పెట్టుబడి ఆహ్వానాన్ని వ్యతిరేకిస్తూ మొదటి దేశవ్యాప్త సమ్మె 29 నవంబర్ 1991లో మొదలైంది. కార్మికులకు అధిక వేతనాలు, సామాజిక భద్రత కల్పించడం, కార్మిక చట్టాల్లో సంస్క రణలకు వ్యతిరేకంగా జరిగిన దేశవ్యాప్త సమ్మెల్లో కార్మికులు ప్రతియేటా పాల్గొంటు న్నారు. అంతేకాక ఉద్యోగ భద్రత, పెన్షన్ హక్కును డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మెలు నిర్వహిస్తున్నారు. 2020 నవంబర్ 26న జరిగిన దేశవ్యాప్త సమ్మెలో 25 కోట్ల మంది అనగా 250 మిలియన్ల కార్మికులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమ్మె ద్వారా తమ నిరసన తెలియజేశారు. ఇది ప్రపంచంలో జరిగిన అతిపెద్ద సమ్మెల్లో ఒకటని జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలు అభివర్ణించాయి. 2019 జనవరి 8-9 తేదీల్లో జరిగిన రెండు రోజుల సమ్మె, 2022 మార్చి 28-29 తేదీల్లో జరిగిన సమ్మెలు, బ్యాంకింగ్, రవాణా, ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రభావితం చేశాయి. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక కార్మికుల హక్కుల కోసం పోరాడే శక్తివంతమైన వేదికగా నిలుస్తున్నది. జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె కూడా అందులో భాగం కానుంది.

ప్రస్తుతం మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను బానిసత్వంలోకి నెట్టి వేసే లక్ష్యంతో 29 కార్మిక చట్టాల్ని రద్దు చేసి, వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు అడుగులు వేస్తున్నది. ఫ్యాక్టరీల్లో, పని ప్రదేశంలో యూనియన్లు లేకుండా చేయటమే లక్ష్యంగా, కార్మికవర్గాన్ని నిరాయుధుల్ని చేయడమే ధ్యేయంగా ఈ లేబర్ కోడ్స్ అని స్పష్టమవుతున్నది. 2002లో అప్పటి వాజ్‌పాయి ప్రభుత్వం 2వ లేబర్ కమిషన్‌ను రవీంద్రవర్మ నేతృత్వంలో నియమించి 44 కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్స్‌ను తీసుకురావాలని ప్రతిపాదించింది. ప్రస్తుత మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, చట్టవిరుద్ధ విధానాలు దాదాపు అన్ని కూడా 2వ లేబర్ కమిషన్ సిఫార్సులను పోలి ఉండటాన్ని గమనిస్తే అప్పటినుండి యజమానులకు అనుకూలంగా, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాయ పూనుకున్నదన్న విషయం అవగతమవుతున్నది. 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వానికి వామపక్ష పార్టీల సహకారం ఉండటం వల్లన లేబర్‌కోడ్స్‌ను తీసుకురావడానికి వెనుకడుగు వేసింది. 2014లో తిరిగి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చి వాటి ప్రక్రియను ప్రారంభించింది. కార్మిక సంఘాల సమ్మెలు, పోరాటాల వలన వెంటనే అమలు చేయడానికి ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. 2019లో మూడోసారి అధి కారం చేపట్టిన తర్వాత పార్లమెంట్‌లో వేతనాల కోడ్‌ను పాస్ చేయించుకుంది. 2020లో మిగిలిన మూడు పారిశ్రామిక సంబం ధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్స్‌ను ఆమోదించుకుంది. మూడు వ్యవ సాయ నల్లచట్టాలు పార్లమెంటులో ప్రవేశపెట్టగా అప్పటి ప్రతిపక్ష పార్టీల పార్లమెంట్ సభ్యులు వాటికి నిరసనగా వాకౌట్ చేసిన సమయంలో ఈ లేబర్ కోడ్స్‌ను దొడ్డిదారిలో ఆమోదింపజేసుకుంది.

ఈ లేబర్‌కోడ్స్‌ను సరిగ్గా పరిశీలిస్తే కార్మిక వర్గంపై ప్రత్యక్ష దాడిచేసి వారి హక్కుల్ని హరించేందుకు ఉద్దేశించిన విధంగా ఇవి రూపొందించబడ్డాయి. దేశ సహజ వనరులను, ప్రజలను దోచుకోవడానికి, కార్పొరేట్ యాజమా న్యాలకు లాభాలు కట్టబెట్టడానికి, కార్మికులను మరింత దోపిడీ చేసేలా ఉన్నాయి. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన కార్మికులు, సంఘాలు కార్మికులతో కలిసి నిరంతర పోరాటాలు, ఆందోళనలు, ప్రతిఘటనలు చేయడం వల్ల ఈ నాలుగేండ్ల నుంచి ఈ లేబర్‌కోడ్స్‌ని అమలు చేయటంలో కేంద్రం కాస్తా వెనుక్కు తగ్గింది. అయితే 2025లో ఈ లేబర్ కోడ్స్‌ను ఎలాగైనా అమలు చేయలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఇప్పటికే మోడీ ప్రభుత్వం "జన విశ్వాస్" అనే చట్టంలోని నిబంధనల ప్రకారం అనేక చట్టాల కింద కార్పొరేట్లకు సంబంధించి 180 నేరాలను నేరరహితం చేసింది. ఈ చట్టాలను ఉల్లంఘించినందుకు యజమానులకు జైలు శిక్షలు విధించే నిబంధనలను ఈ లేబర్ కోడ్స్‌లో ఉపసంహరించింది. 2025 కేంద్ర బడ్జెట్‌లో కూడా మరో 100 నేరాలను నేర రహితం చేసింది. "శ్రమ సమాధాన్", "శ్రమ సువిధ పోర్టల్"లు యజమానులు కార్మిక చట్ట ఉల్లంఘనలను సులభతరం చేయడానికి, ఫిర్యాదు ఆధారిత తనిఖీలను ఈ లేబర్ కోడ్స్ ద్వారా రద్దు చేసింది.

మరోవైపు కార్మికులు పోరాడి సంపాదించు కున్న హక్కులను కాలరాస్తూ సమిష్టి బేరసారాల చర్యలను లేబర్‌కోడ్స్ తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నది.

# భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ నాయకులు

**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం జై బాపు.. జై భీం.. జై సంవిధన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ ఎల్బి స్టేడియంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళనం భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, విచ్చేస్తున్నారు. కావున చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, పిలుపు మేరకు బోయినిపల్లి మండలంలోని 23 గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ నాయకులు భారీ బహిరంగ సభ కు తరలి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమనికి బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టపెల్లి సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీం రెడ్డి మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గుడి శేఖర్ రెడ్డి, మెరుపుల మహేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉయ్యాలా శ్రీనివాస్ గౌడ్, పిట్టల రమేష్, మాజీ సర్పంచ్ కోరేపు నరేష్, కాంగ్రెస్ నాయకులు కొప్పుల నగేష్, శ్రీనివాస్ రెడ్డి, ఎండీ హుస్సేన్,నల్ల మోహన్, అమ్మిగల్ల గోపాల్, మంద వెంకటేష్, ఎండీ రఫీ,జాగిరి వెంకటేష్, ధర్మయ్య మరియు బోయినిపల్లి మండలంలోని 23 గ్రామాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



తదితరులు భారీ సంఖ్యలో తరలి వెళ్లడం జరిగింది.

# రైల్ రోకోను విజయవంతం చేయండి

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలో జాగృతి రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ మాట్లాడుతూ జూలై 17న రాష్ట్ర వ్యాప్తంగా రైల్ రోకో కార్యక్రమానికి పిలుపునిచ్చిన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు నిజామాబాద్ ఎమ్మెల్సీ కవితక్క . జాగృతి ఆధ్వర్యంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కవితక్క కేంద్రం పైన చేస్తున్న పోరు లో జాగృతి యువత నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని జాగృతి రాష్ట్ర నాయకులు అమ్మ అశోక్ తెలియజేశారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చినాకనే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని కోరడం జరిగింది అని ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి యుపీఎఫ్ ఒత్తిడితో అసెంబ్లీలో ప్రభుత్వం మూడు బీసీ బిల్లులు పెట్టిందని ఇది తెలంగాణ జాగృతి విజయమని వారు తెలియజేశారు. రాజకీయ అవకాశాల్లో బీసీ మహిళల పరిస్థితి దారుణంగా ఉంది వారికి మహిళా రిజర్వేషన్లు బీసీలకు ఉపకోట ఉండాలని కవితక్క ఏదైతే చేశారో దాన్ని జాగృతి యువత పూర్తి మద్దతు ఉంటుందని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. మరి సమాజంలో 56శాతం సంబంధించి హక్కులు కోరుతుంటే కచ్చితంగా ఈ మానవ హక్కుల సంబంధించింది అని కవితక్క చేసిన దానికి పూర్తిగా ఏకభవిస్తూ కచ్చితంగా రైలు రోకొని ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఉన్న పరిసర ప్రాంతాల్లో ఉన్న రైల్వే స్టేషన్ దగ్గర ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు



కోరారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు గుడికందుల శివ, దురిశెట్టి రేవంత్, ఇనుగాల వంశీ, శ్రీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# "పది" స్టూడెంట్స్‌కు మోడీ కానుక

- **కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బర్త్ డే సందర్భంగా..**
- **కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో 20వేల సైకిళ్ల పంపిణీ**
- **సైకిల్ పై ఓవైపు మోడీ.. మరోవైపు బండి ఫోటోల ముద్రణ**

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఈనెల 11న కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్సియల్ స్కూళ్లలో చదివే టెన్త్ క్లాస్ విద్యార్థినీ, విద్యార్థులతోపాటు భారీ ఎత్తున సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. తన పార్లమెంట్ పరిధిలోని జిల్లాల వారీగా చూస్తే కరీంనగర్ జిల్లాలో పదో తరగతి చదువుకునే బాలబాలికలు 3096 మంది ఉన్నారు. రాజన్న సిరిసిల్లలో 3841, జగిత్యాల జిల్లాలో 1137, సిద్దిపేటలో 783, హన్మకొండ జిల్లాలో 491 మంది వెరసి 9348 మంది బాలబాలికలు టెన్త్ క్లాస్ అభ్యసిస్తున్నారు. అలాగే కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో 66 డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్ కు 50 చొప్పున సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. వీటితోపాటు ఒక్కో మండలానికి వంద చొప్పున సైకిళ్లను అదనంగా పంపిణీ చేస్తారు. హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో వార్డుకు 50కి చొప్పున పంపిణీ చేస్తారు. ఇక గ్రామ పంచాయతీల వారీగా 10 నుండి 25 సైకిళ్ల చొప్పున పంపిణీ చేయనున్నారు. తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 20 వేల సైకిళ్లను దశలవారీగా పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు సైకిళ్ల తయారీలో పేరుగాంచిన ప్రముఖ సంస్థకు నెల రోజుల క్రితమే ఆర్డర్ కూడా ఇచ్చారు.

ఇప్పటికే 5 వేల సైకిళ్లు కరీంనగర్ కు వచ్చాయి. తొలి దశలో ఐదు వేల సైకిళ్లను ఈనెల 8 లేదా 9వ తేదీన పంపిణీ చేసేందుకు బండి సంజయ్ సిద్ధమయ్యారు. మిగిలిన సైకిళ్లు కూడా వచ్చిన వెంటనే అసెంబ్లీ నియోజకవర్గాల, మండలాల వారీగా పంపిణీ చేయనున్నారు. ఇక సైకిళ్ల ఖర్చు వివరాలకు వస్తే ఒక్కో సైకిల్ ను రూ.4 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. సైకిల్ రాడ్ కు ఒకవైపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇంకోవైపు బండి సంజయ్ ఫోటోను ముద్రించనున్నారు.

**- టెన్త్ విద్యార్థులకే ఎందుకంటే**



ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుండి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందే. తమ ఇంటి నుండి స్కూల్ దాకా వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాల్లేక, ఆటోలు, బస్సులు వెళ్లే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ విషయానికొచ్చే సరికి స్కూల్ వేళలు ముగిసిన తరువాత స్పెషల్ క్లాస్ లకు హాజరు కావాల్సి ఉంటుంది. దీనివల్ల పొద్దుపోయేదాకా స్కూళ్లోనే ఉండాల్సి వస్తుంది. దీనిని ద్రుష్టిలో ఉంచుకుని టెన్త్ బాలబాలికలకు రవాణా ఇబ్బంది ఉండకూడదనే సదుద్దేశంతో బండి సంజయ్ కుమార్ ప్రధాని మోదీ కానుకగా సైకిళ్లను పంపిణీ చేయనుండటం విశేషం.

# నగరాన్ని ముంపు నుంచి కాపాడండి

ప్రాంతం నుంచి వర్షపు నీరు శివనగర్, పెరిక వాడ, ఎస్.ఆర్.ఆర్ తోట అండర్ బ్రిడ్జి వంటి ప్రాంతాలను ముంచెత్తుతోంది. సైడ్ డ్రైన్స్ లేకపోవడంతో సమస్య ఏటేటా తీవ్రమవుతోందని వాపోయారు. ఇప్పటివరకు అగర్తల చెరువు నుంచి చేపట్టిన డ్రైనేజీ కాల్వ పనులు ఇంకా పూర్తి కాలేదని, గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలని కోరారు.

**- తగ్గిన భద్రకాళి చెరువు విస్తీర్ణం**

భద్రకాళి ఆలయ ఆధునీకరణ పేరుతో చేపట్టిన ఐలాండ్, మాడ వీధుల పేరుతో వైశాల్యాన్ని భారీగా తగ్గించారని, దీంతో ఇటు బొందివాగు నీరు చెరువులోకి వెళ్లే పరిస్థితి లేదని గంట రవికుమార్ పేర్కొన్నారు. భద్రకాళి చెరువుపూడిక తీత పనులు పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో సంతోషిమాత గుడి పరిసరాలు, హంటర్ రోడ్ తదితర ప్రాంతాలు మరింత నీట మునిగే ప్రమాదముందన్నారు. అలాగే, ఇదే ప్రాంతంలో ఉత్తర, దక్షిణ భారతాన్ని కలిపే వరంగల్-కాజీపేట రైల్వే ట్రాక్ కూడా ముంపు పడడం ఖాయమన్నారు.

**- బొందివాగుపై దృష్టి సారించాలి**

ఎగువ నుంచి వరంగల్ మహా నగరంలోకి ప్రవేశించే బొందివాగు సమస్యను పరిష్కరించడంలో ఏళ్ల నుంచి తాత్సారం జరుగుతోందని పాలకుల తీరును గంట రవికుమార్ దుయ్యబట్టారు. మామునూరు నుంచి భద్రకాళి చెరువు వరకు చాలాచోట్ల వాగు కబ్జాకు గురైందని, గతంలో విస్తరణ పనులు చేపట్టినా ఇంకా పూర్తికాక పోవడం అధికారులు చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందని ఎద్దేవా చేశారు. అలాగే, వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు వరద నీరు ఆటోనగర్, డాక్టర్స్ కాలనీ మీదుగా కోట చెరువుకు వెళ్లే నాలా పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని, ఫలితంగా ముంపు ప్రాంతాలు మరింత ముంపునకు గురువుతున్నాయని స్పష్టం చేశారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి నాలా కబ్జా చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీంలను నగరంలో ముంపు ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో ముందు జాగ్రత్త చర్యగా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీంలను అందుబాటులో ఉంచాలని గంట రవికుమార్ సూచించారు. బాధితులను సకాలంలో తరలించేందుకు తగిన బోట్లను కూడా సమకూర్చాలన్నారు. సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలు వేగవంతంగా చేపట్టేలా చూడాలని, మహానగరాన్ని ముంపు నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు ఆడేపు స్వప్న, గందె కల్పన, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, గడల కుమార్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, కోశాధికారి కూచన క్రాంతి కుమార్, అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, పెద్ది నవీన్, బిజెపి నాయకులు గందె నవీన్, ఆడెపు సదానందం, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరి మురళకృష్ణ, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైరి నాగరాజు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజు, పెద్ది నవీన్, బిజెపి మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, బిజెపి నాయకులు అంకాల జనార్ధన్, కందుకూరి శ్రీనివాస్, జెట్లింగ్ శివప్రసాద్,కొత్తపెల్లి రాజేష్, సుంకరి రాజు, మహిళా మోర్చా నాయకురాలు కూరతోట రాజేశ్వరి, నిహారికలు పాల్గొన్నారు.

# సబ్జాన్‌కు హాస్టల్‌లో సీటు..!

## ‘వేద న్యూస్’ తెలుగు దినపత్రిక కథనానికి స్పందన

- జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి గౌస్ హైదర్ హామీ
- సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే నిజమైన జర్నలిజం
- ‘వేద న్యూస్’కు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అభినందన

**వేద న్యూస్, కమలాపూర్:**

ఈ నెల 4న (శుక్రవారం) ‘వేద న్యూస్’ తెలుగు దినపత్రిక ప్రధాన సంచికలో ‘హాస్టల్ సీటు ఇప్పించరూ!’ శీర్షికన ప్రముఖంగా ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కే. ఏ. గౌస్ హైదర్ స్వయంగా ఆయనే.. కమలాపూర్ మండల పరిధిలోని కాసింపల్లిలోని విద్యార్థిని సయ్యద్ సబ్జాన్.బి. ఇంటికి వెళ్లి విద్యార్థినితో, బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి సమస్య ఏంటో వివరంగా తెలుసుకున్నారు. వెంటనే సబ్జాన్‌కు హాస్టల్‌లో ఉండి చదువుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్టు హామీ ఇచ్చారు. నడవడానికి చాలా ఇబ్బంది పడుతూ కూడా గొప్పగా చదువుకోవాలనే ఆశయంతో సబ్జాన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. రోజుకు 4 కిలోమీటర్లు నడుచుకుంటూ మరీ సబ్జాన్ పాఠశాలకు వెళ్లడం నిజంగా అభినందించదగ్గ విషయమని, విద్యార్థినిని అభినందించారు.

**– ప్రతి మైనార్టీ విద్యార్థికి హాస్టల్ సీటు ఉచితం**



గొప్పగా చదువుకొని జీవితంలో గొప్పగా స్థిరపడాలనే ఉద్దేశం ఉన్న ప్రతి ఒక్క మైనారిటీ విద్యార్థికి హాస్టల్‌లో ఉచితంగా సీటు ఇస్తామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కే. ఏ. గౌస్ వెల్లడించారు. ఈ చక్కటి అవకాశాన్ని ప్రతి ఒక్క మైనార్టీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మైనారిటీ హాస్టల్‌లో చాలా చక్కటి వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి విద్యా బోధనతో పాటు పౌష్టికమైన ఆహారాన్ని, విద్యార్థులకు స్కూల్ యూనిఫార్మ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఇంకా అనేక రకాల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. చదువుపై ఆసక్తి ఉండి గొప్పగా చదువుకొని.. భవిష్యత్తులో గొప్పగా స్థిరపడాలని ఆశయమున్న ఏ ఒక్క మైనార్టీ విద్యార్థి అయినా.. తన దగ్గరికి వస్తే ఉచితంగా సీటు ఇచ్చి చదువుకునేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో తన ఆఫీసు ఉంటుందని, నేరుగా వచ్చి కలిసినా లేదా 98490 78550 ఫోన్ నంబర్‌లో అయినా సంప్రదించొచ్చని స్పష్టం చేశారు.



వేద న్యూస్

హాస్టల్ సీటు ఇప్పించరూ!

- బాగా చదవాలనుంది: విద్యార్థిని వేడుకోలు
- చిన్ననాటే రెండు కాళ్లు వంకర.. చదువు పట్ల మక్కువ
- కుంటుతూనే 4 కి.మీ. నడిచి స్కూల్‌కు వెళ్తున్న సబ్జాన్
- ఒక్కరోజు కూడా డుమ్మా కొట్టకుండా పాఠశాలకు..

వేద న్యూస్, కమలాపూర్:

విద్యతో పేదరికాన్ని జయించొచ్చనేది అక్షర సత్యం. ప్రస్తుత సమాజంలో ప్రతిఒక్క తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల ఎంతో జాగరుకతతో వ్యవహరిస్తున్నారు. చక్కటి పాఠశాలకు పంపించేందుకు ఎన్ని కష్టాలైనా పడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం పూట స్కూల్ డ్రెస్, టిఫిన్ బాక్స్ సర్దడమే కాకుండా బస్సెక్కించి.. స్కూల్‌కు సాగనంపుతున్నారు. అయితే, ఆర్థికంగా ఆ మేరకు స్తోమత లేని వారి సంగతేంటి..? వారి కష్టాలు వర్ణనాతీతమే. అందులో సదరు విద్యార్థినికి అంగవైకల్య సమస్యలుంటే ఇక ఆ బాధలు చెప్పలేం. ఈ కోవకు చెందిన ఓ విద్యార్థియే.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని కాసింపల్లికి చెందిన ఓ నిరుపేద విద్యార్థిని సయ్యద్ సబ్జాన్ బి. బాలిక తల్లిదండ్రులు అంగూరా బి, హుస్సేన్. ప్రతి రోజూ స్కూల్‌కు వెళ్లేందుకు సబ్జాన్ పడే కష్టం చూస్తే కంటతడి పెట్టని వారుండబోరు అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. చిన్ననాటి నుంచి చదువు పట్ల ఆసక్తి కలిగిన సబ్జాన్ బి.. తన రెండు కాళ్లు వెనుకకు మెలి తిరిగి ఉన్నా.. ఇబ్బందులు పడుతూనే స్కూల్‌కు నడిచి వెళ్తోంది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కమలాపూర్ మండల కేంద్రంలోని ఐవోసీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ప్రైమరీ స్కూల్‌లో చదివిన ఆమె.. ప్రస్తుతం ఆరో తరగతి చదవడం కోసం బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో చేరింది. స్కూల్‌కు వెళ్లేందుకు.. కాసింపల్లిలోని తన ఇంటి నుంచి ఆమె ఉదయం దాదాపు 2 కి.మీ., తిరుగు ప్రయాణంలో 2 కి.మీ. మొత్తం సుమారు 4 కి.మీ. ప్రతిరోజూ అవస్థలు పడుతూ.. నరకయాతన అనుభవిస్తూ.. కుంటుతూ నడుస్తోంది. చదువు పట్ల పట్టుదలతో ముందుకెళ్తున్న సదరు విద్యార్థినికి హాస్టల్ సీటు ఇప్పిస్తే.. ఆమె కష్టాలు తీరుతాయని.. మానవతా దృక్పథంతో సీటు కేటాయించాలని విద్యార్థిని పేరెంట్స్ కోరుతున్నారు. తనకు హాస్టల్ సీటు ఇస్తే.. తాను బాగా చదువుకుంటానని విద్యార్థిని సబ్జాన్ పేర్కొంటున్నారు.

2025-07-04
https://epaper.vedhanews.in/

**– సమస్య పరిష్కారానికి ‘వేద న్యూస్’ చొరవ**

4 కి.మీ. కుంటుతూ స్కూల్‌కు నడుచుకుంటూ వెళ్తున్న సబ్జాన్ అనే విద్యార్థిని సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి, తమ దృష్టిలో పడేలా చేసి, తమను విద్యార్థిని ఇంటికి వచ్చేలా చేసి.. సమస్యకు పరిష్కారం చూపేలా చొరవ చూపించిన ‘వేద న్యూస్’ తెలుగు దినపత్రికకు ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కే. ఏ. గౌస్ అభినందనలు తెలిపారు. ఇలాంటి సమస్యలు వెలుగులోకి తీసుకురావడమే నిజమైన జర్నలిజమని, విలువలతో కూడిన జర్నలిజం అని..అలాంటి పని చేస్తున్న ‘వేద న్యూస్’ తెలుగు దినపత్రికను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయన వెంట టీచర్లు రమాదేవి, ఆసియా పర్వీయా ఉన్నారు.



# ముందస్తు తెలంగాణ బోనాలు

**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి పట్టణంలోని కృష్ణవేణి స్కూల్లో ముందస్తు తెలంగాణ బోనాలను పురస్కరించుకొని కృష్ణవేణి స్కూల్లో ముందస్తు తెలంగాణ బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా నృత్యాలతో అలరించారు. ఈ వేడుకల్లో భాగంగా గ్రామ దేవతకు బోనాలు సమర్పించారు. తదనంతరం స్కూల్ కరెస్పాండెంట్ పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ బోనాల విశిష్ఠత ను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాంబ రాజు, ఇంచార్జీ సాంబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళల మెహందీ సంబురాలు

**వేద న్యూస్, చొప్పదండి :**



గంగాధర మండల కేంద్రంలోని 9వ వార్డ్ లో స్థానిక మహిళలు శుక్రవారం మెహందీ సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. ఈ సందర్భంగా గంగాధర మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంత్రి లత మాట్లాడుతూ ఆషాడ మాసంలో మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకోవడం సాంప్రదాయంగా వస్తోందని, ఎన్నో మూలిక లక్షణాలున్న గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పోతరాజు అంజలి, వాసాల లత, వాసాల సునీత, పోతరాజు లత, చిందం లావణ్య, ర్యాకం ప్రియ, ఉప్పు శ్రీలత, ముమ్మడి మాధవి, రజిత మరియు పిల్లలు పాల్గొన్నారు.

# కార్యనిర్వాహణ కార్యదర్శిగా పండిట్ శ్రీనివాస్ గురూజీ

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



పరంపర వైద్య మహా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శిగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు భోధి ధర్మ ఆయుర్వేదిక్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ పండిట్ శ్రీనివాస్ గురూజీని నియమించినట్లు పరంపర వైద్య మహా సంఘం గౌరవ అధ్యక్షులు సజ్జన రమేష్ ప్రకటించారు. శుక్రవారం యాదగిరి గుట్ట లో జరిగిన పారంపర్య వైద్య మహా సంఘం రాష్ట్ర సమావేశంలో ఈ మేరకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పండిట్ శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన గౌరవ అధ్యక్షులు సజ్జన రమేష్,అధ్యక్షులు మహర్షి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామంచి శ్రీనివాస్ లకు కృతజ్ఞతలు తెలిపారు.ఇంత మంచి బాధ్యతను తనకు ఇచ్చినందుకు సంఘం యొక్క కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతూ సంఘం యొక్క గౌరవాన్ని పెంచుతూ చట్టబద్ధత కోసం అనేక కార్యక్రమాలు అందరి సహకారంతో చేస్తానని సంఘ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధి కారి దుర్గా దేవి,కార్యవర్గ సభ్యులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులుగా పుట్టడంమే పాపమా..?

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు గిరిజన హాస్టల్ విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన హాస్టల్ విద్యార్థులకు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు గిరిజన కళాశాల హాస్టల్ విద్యార్థులకు గత డిసెంబర్ నుంచి ప్రస్తుత జూన్ వరకు మెస్ కాస్మెటిక్ చార్జీలు విద్యార్థులు విడుదల చేయకుండా గిరిజన విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం మంచిది కాదన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో మరియు గిరిజన వసతి గృహాలలో వంద శాతం ఫలితాలు సాధించిన గిరిజన విద్యార్థుల పొట్ట కొట్టడం ముఖ్యమంత్రి కీ న్యాయ మా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతుందని అన్నారు. గిరిజన హాస్టల్ వసతి గృహ అధికారులు గత ఆరు నెలలుగా బహిరంగ మార్కెట్లో వడ్డీలకు తీసుకొచ్చి మరియు చివరికి హెచ్ డబ్ల్యు ఓ ల భార్య మెడలో ఉన్న పుస్తెలతాడు సైతం బ్యాంకుల్లో తాకట్టు పెట్టి వసతి గృహాలు నడిపి చివరికి వారు రోడ్డు మీద పడే పరిస్థితి ఉందని అన్నారు.తక్షణమే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న గిరిజన హాస్టల్ విద్యార్థుల మెస్ కాస్మెటిక్ చార్జీలు విద్యార్థులు విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ ,ఎస్టీ ,బీసీ వసతి గృహాలకు సొంత భావనాలు నిర్మించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన హాస్టల్ లు గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు 100శాతం ఫలితాలు సాధించారని విద్యార్థులకు మరియు హెచ్ డబ్ల్యు వో లకు మంత్రి సీతక్క గిరిజన డిపార్ట్మెంట్ విద్యార్థులకు మరియు వార్డెన్ లకు శాలువా కప్పి స్వీట్ తినిపించి వారికి ఇవ్వవలసిన మెస్ బకాయిలు ఇవ్వకుండా పేద మధ్యతరగతి గిరిజన విద్యార్థుల మెస్ చార్జీలు విడుదల చేయడం మరిచారని అన్నారు.భవిష్యత్ లో తక్షణమే గిరిజన ఆశ్రమ గిరిజన హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని లేని పక్షంలో ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బలమైన సమరశీల విద్యార్థి ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బెస్ట్ అవలబ్ స్కూల్ విద్యార్థులకు బకాయిలు విడుదల చేయడం లేదు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వానికి బిఆర్ యస్ కి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదా నాయక్, డివిజన్ అధ్యక్షుడు మూడవత్ జగన్ నాయక్, వీరన్న,అంజి,రంగ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073